అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



5

**వీరభద్రస్వామి జాతర**

**బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రులు**

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 266 శనివారం 17 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి

## నిర్మల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ పిలుపు

**ఉమ్మడి జిల్లాకు యూనివర్సిటీ మంజూరు**

**బాసర ఐఐటిలోన క్యాంపస్ ఏర్పాటు చేస్తాం**

**నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు**

**పనుల కోసమే మోడీతో భేటీ అవుతూనే ఉంటా**

**తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టి తీరుతాం**

**కెసిఆర్ అప్పులతో తెలంగాణ కుప్పయ్యింది**

**చనాక-కొరాట బ్యారేజ్ నుంచి ప్రధాన కాలువకు సాగునీరు.. సదర్‌మాట్ బ్యారేజ్ ప్రారంభం**

ఆదిలాబాద్ **జనవరి 16(జర్నలిస్ట్ వార్త);**
'గత ఎన్నికల్లో గెలిచాం.. రాబోయే ఎన్నికల్లోనూ గెలుస్తాం.. రాష్ట్రంలో మళ్లీ తిరిగి అధికారంలోకి వస్తాం. మున్సిపల్ ఎన్నికల్లో మంచి చేసే వారిని, అభివృద్ధి చేసే వారినే గెలిపించండి. నాకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని మిగతా 2లో.



# ఏఐతో జాగ్రత్త




**అది సంపన్నుల ఆయుధం**


**భవిష్యత్తుకు భారీ ముప్పు**

**టెక్ నిపుణులకు తొలగింపు భయాలు**

**మంచి కంటే కీడే ఎక్కువ**

**: ఏఐ పితామహుడు హింటన్ హెచ్చరిక**

న్యూఢిల్లీ **జనవరి 16(జర్నలిస్ట్ వార్త);**
ప్రస్తుతం ఎక్కడ విన్నా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) మాటే వినబడుతున్నది. ప్రతి ఒక్కరూ దీని గురించి తెలుసుకోవాలనే ఆరాటం, దీని మీద ఆధారపడి పనిని సులువు చేసుకుంటున్న తీరు కనబడుతుంది. ప్రస్తుతం టెక్ ప్రపంచంలో ఏఐ పరుగులు పెడుతోంది. ఈ ఏఐతో మంచి కంటే కీడే ఎక్కువగా ఉందనే ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతోన్న వేళ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పితామహుడు, నోబెల్ బహుమతి గ్రహీత జెఫ్రీ ఎవరెస్టు హింటన్ కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో...



# భారత్ కు మరిన్ని రఫేల్ యుద్ధ విమానాలు... డీపీబీ గ్రీన్ సిగ్నల్

**114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు ఆయుధ సేకరణ బోర్డు ఆమోదం**

**రక్షణ మంత్రి నేతృత్వంలోని డీఏసీ ముందుకు వెళ్లనున్న ఫైల్**

**వచ్చే నెలలోనే భారత్, ఫ్రాన్స్ మధ్య తుది ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం**

**హైదరాబాద్‌లోని టాటా ప్లాంట్‌లో రఫేల్ ఫ్యూజ్‌లేజ్‌ల తయారీకి ఒప్పందం**



న్యూఢిల్లీ **జనవరి 16(జర్నలిస్ట్ వార్త);**
భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసే ప్రతిపాదనకు ఆయుధ సేకరణ బోర్డు (డీపీబీ) శు క్రవారం ఆమోదం తెలిపింది. భారత వాయుసేన (ఐఏఎఫ్) గత ఏడాది ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖకు అధికారికంగా ప్రతిపాదన పంపిన విషయం తెలిసిందే.రక్షణ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రతిపాదన తదుపరి ఆమోదం మిగతా 2లో...

## మీ పాలనలో ఇంకెంతమంది బలి కావాలి

**గురజాలలో సాల్మన్ హత్యపై జగన్**



అమరావతి,**జనవరి 16(జర్నలిస్ట్ వార్త);**
గురజాల నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్త సాల్మాన్ హత్యపై మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. చంద్రబాబు.. మీరు పాలించడానికి అర్హులేనా?.. రాజకీయ కక్షలతో ఎంతమంది ప్రాణాలను బలి తీసుకుంటారు? ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం,మిగతా 2లో...

## మరో ఇద్దరికి స్పీకర్ క్లీన్‌చిట్

**ఇంకా ముగ్గురిపై కొనసాగనున్న విచారణ**

**దానం రాజీనామా తప్పదా ?**



2లో.

# విద్య ద్వారానే జీవితాల్లో మార్పు

**నిరుద్యోగుల్ని బీఆర్ఎస్ మోసం చేసింది**

**వారి ఉద్యోగాలు పోతేనే.. మీకు ఉద్యోగాలొస్తున్నాయి**

**రెండేండ్లలో 70 వేల ఖాళీలు భర్తీ చేశాం**

**నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి**

**గ్రూప్ 3 అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్**జనవరి 16(జర్నలిస్ట్ వార్త);**
ప్రజలకు పంచేందుకు భూముల్లేవనీ, విద్యను మాత్రమే అందించి వారి జీవితాల్లో మార్పు తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందని తెలిపారు. వివిధ శాఖల్లో గ్రూప్ 3 ఉద్యోగాలకు ఎంపికైన 1,370 మందికి శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మిగతా 2లో...



## 'స్టార్టప్ ఇండియా' మిషన్‌కు పదేళ్లు పూర్తి

**దేశ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు**

**దేశ యువత నిజమైన సమస్యలను పరిష్కరిస్తోందన్న మోదీ**

**పదేళ్లలో 500 నుంచి 2 లక్షలకు పైగా చేరిన స్టార్టప్‌లు**

**125కు పైగా యూనికార్న్‌లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్**

**స్టార్టప్‌లలో మహిళల భాగస్వామ్యం పెరిగిందన్న ప్రధాని**



2లో.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్ రెండో దశ పనుల పురోగతిపై లేఖ రాసిన కేంద్ర మంత్రి**

**మెట్రో రెండో దశ గురించి కేంద్ర మంత్రితో చర్చించాన్న కిషన్ రెడ్డి**

# తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్

**రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో అభివృద్ధి**

**క్యాంపు కార్యాలయంలో అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష**

అమరావతి,**జనవరి 16(జర్నలిస్ట్ వార్త);**తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో ఈ కేంద్రం ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
మిగతా 2లో...



# తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా, వారికి అన్ని విధాలా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు భవిష్యత్తులో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు.. ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని సీఎం తెలిపారు. వివిధ రంగాల్లో కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్ల డివైజెస్-సెన్సర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, రూరల్ ఏరియా టెక్నాలజీ వంటి రంగాలు భవిష్యత్తులో కీలకం కానున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగా పాలసీలు రూపొందిస్తోందని వివరించారు. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలను ప్రోత్సహిస్తోందని సీఎం తెలిపారు. దేశంలో తొలిసారిగా గ్రీన్ ఎనర్జీ రంగంలో.. గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ తరహాలో కొత్త ఆవిష్కరణలకు.. వివిధ స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రం వేదికగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు భవిష్యత్తులో డిమాండ్ ఉన్న రంగాలకు పెద్దపీట వేయడమే కాకుండా.. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి అతి పెద్ద రీసెర్చ్ కేంద్రం అవసరమన్న సీఎం.. తిరుపతిలో ఏర్పాటు చేసే ఏపీ-ఫస్ట్ వ్యవస్థ ఆ అవసరాలను తీర్చేలా ఉండాలన్నారు. రాష్ట్రంలోని యువతకు సహకరించేలా పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. తిరుపతిలోని ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ రెండు ప్రముఖ జాతీయ విద్యా సంస్థల కాంబినేషన్లో ఏపీ ఫస్ట్ ఏర్పాటు కానుందన్న చంద్రబాబు.. దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలని స్పష్టంచేశారు. ఏపీ ఫస్ట్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరపాలని సూచించారు.

# విద్య ద్వారానే జీవితాల్లో మార్పు

(మొదటి పేజీ తరువాయి)

నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పదేండ్లలో ఆ పార్టీ నేతలు సొంత లాభం చూసుకున్నారే తప్ప నిరుద్యోగులను పట్టించుకోలేదన్నారు. ఓయూ విద్యార్థులు ఉద్యమకారులై ప్రాణత్యాగాలు చేసి సాధించిన తెలంగాణలో వారొక్క కుటుంబమే బాగుపడిందని ఆరోపించారు. వారి ఉద్యోగాలు ఊడితే తమకు ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకుందని అన్నారు. 14 ఏండ్ల పాటు గ్రూప్-1 ఖాళీలు భర్తీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఒకట్రెండు నోటిఫికేషన్లు ఇచ్చినా పేపర్ లీక్‌లతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయతను బీఆర్ఎస్ ప్రభుత్వం దెబ్బతీసిందని వ్యాఖ్యానించారు.

తాము అధికారం చేపట్టిన తర్వాత టీజీపీఎస్సీని బలోపేతం చేసి విద్యావంతులను, నిష్ణాతులను సభ్యులుగా నియమించామని చెప్పారు. ఇటీవల గ్రూప్-1 నియామక పత్రాలు ఇచ్చే సమయంలో కూడా కోర్టుకు వెళ్లి కుట్రలు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో 60 వేలు, రెండో ఏడాది 10 వేలు, మొత్తం రెండేండ్లలో 70 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని సీఎం తెలిపారు. ”కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన మీరు మీ తల్లిదండ్రుల కండ్లల్లో సంతోషం నింపాలి. పుట్టిన బిడ్డ ప్రయోజకుడైతే వారి ఆనందా నికి అవధులుండవు. ఉద్యోగాలు భర్తీ చేయడం మా బాధ్యత. కానీ మీకు జీవితకాల విజయం. ఉద్యోగం మీ కుటుంబంలో భవిష్యత్ తరాలకు దిక్సూచిగా మారుతుంది. కేవలం వేతనం తీసుకునేది మాత్రమే కాదని.. ఉద్యోగం భావోద్వేగం అని గుర్తుంచుకోండి. తెలంగాణ పునర్నిర్మాణంలో కలిసి రావాలి. అందరు కలిసికట్టుగా పని చేస్తే ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తాం. రాష్ట్ర ప్రభుత్వంలో 10.5 లక్షల మంది ఉద్యోగులు వివిధ దశల్లో ఉన్నారు. వారి అడుగు జాడల్లో నడిచి సర్కార్‌కు మంచి పేరు తేవాలి” అని సీఎం వారికి దిశా నిర్దేశం చేశారు.

ఏ దేశమైనా, ఏ సమాజమైనా విద్యతోనే అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ మొదటి ప్రధాని పండిట్ జవహార్ లాల్ నెహ్రూ మొదటి ప్రాధాన్యతగా విద్య, వ్యవసాయాన్ని తీసుకున్నారని గుర్తు చేశారు. దేశంలోని అన్ని యూనివర్సిటీలు, శ్రీశైలం, నాగార్జున సాగర్, ఎస్ఆర్ఎస్పీ లాంటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. అయితే నేడు విద్య, ఆహారం అందరికీ అందుతున్నా నాణ్యమైనది దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది, 11 వేల ప్రయివేట్ పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. ఈ వ్యత్యాసం ఎందుకుంది? తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎందుకు ప్రయివేట్ స్కూళ్లలో చదివిస్తున్నారో ఆలోచించాలన్నారు. వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నా మన పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని ఎందుకు అందించలేకపోతున్నామని ప్రశ్నించారు. ఈ క్రమంలో తమ సర్కార్ నాణ్యమైన విద్య, ఆహారాన్ని పిల్లలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. పిల్లలు తాము అభ్యసించిన విద్యలో నాణ్యత లేక పోతే అవకాశాలు కూడా దొరకవని హెచ్చరించారు. ”రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది ఇంజినీరింగ్ పట్ట భద్రులు వస్తున్నా వారికి తగిన ఉద్యోగం రావడం లేదు. డిమాండ్ ఉంది. సరఫరా ఉంది. కాని స్కిల్స్ లేకపోవడమే కారణం. రేపటి రోజుల్లో స్కిల్స్ అభివృద్ధి చేయాలి. ఇవ్వడానికి భూముల్లేవు. కానీ విద్య ఒక్కటే మన జీవితాల్లో మార్పు తెస్తుంది. సీఎస్, డీజీపీ వరకు ఉద్యోగాలు అందరికి విద్య ద్వారానే వచ్చాయి. ప్రసుత్తం నియామక పత్రాలు అందుకుంటున్న 1,370 మందికి ఉద్యోగాలు విద్య వల్లనే వచ్చాయి. ఈ ప్రభుత్వానికి వారధులు, సారధులు మీరే. 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్లకు తీసుకుపోవాలనేది కేంద్ర సర్కార్ లక్ష్యం.

అదే స్ఫూర్తితో తెలంగాణ ఎకానమిని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల మార్క్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశ జనాభాలో 2.5 శాతంగా ఉన్న మనం 5 శాతం ఎకానమిని అందిస్తున్నాం. 2047 నాటికి 10 శాతం అందించాలనేదే లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో మీరందరూ నిబద్ధతతో పని చేయండి. విధుల్లో చేరిన రోజు ఎంత నిబద్ధతతో పని చేశారో.. అదే నిబద్ధతతో రిటైర్మెంట్ వరకూ పని చేయాలి” అని సీఎం రేవంత్ రెడ్డి వారికి సూచించారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు తమ తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం చేసిన వారి జీతంలోంచి 15 శాతం కోత విధించి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ”అశోక్‌నగర్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వరకు ఏం జరుగుతుందో నాకు అవగాహన ఉంది. రాబోయే రోజుల్లో అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ప్రయివేట్‌లో సైతం భారీ పెట్టుబడులు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తాం” అని సీఎం నిరుద్యోగులకు భరోసా ఇచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు మంచి చేయడా నికే ఉపయోగిస్తా’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభిం చారు. మొదట ఆదిలాబాద్ జిల్లాలోని బోరజ్ మండలంలోని చనాక-కొరాట బ్యారేజ్ నుంచి ప్రధాన కాలువకు సాగునీరు వదిలారు. నిర్మల్ జిల్లాలోని మామడ మండలంలో గల సదర్‌మాట్ బ్యారేజ్‌ని ప్రారంభించారు. అనంతరం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ‘ప్రజాపాలన -- ప్రగతిబాట’ బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేక అభిమానం అని, జల్ జంగల్ జమీన్ అని నినదించిన పోరాటాల గడ్డ ఇది అని తెలిపారు.

పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు కేటాయించాలనుకుంటున్న యూనివర్సిటీని నిర్మల్ జిల్లా బాసరట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేస్తామన్నారు. యూనివర్సిటీని అన్ని ప్రాంతాల నాయకులు తమ ప్రాంతానికే కేటాయించాలని కోరుతున్నారన్నారు. అందుకే బాసరలో ఏర్పాటు చేస్తామని నాయకులందరూ సహకరించాలని కోరారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల లక్షల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు తట్టెడు మట్టి తీయలేదని, ఆ ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. బడ్జెట్ సమావేశాలలోపు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై సంపూర్ణ నివేదిక ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించారు. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు ఒక్కటే ఏర్పాటు చేసుకుంటే సరిపోదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అందుకు 10వేల ఎకరాలు అవసరం ఉందని తెలిపారు. నిర్మల్ జిల్లాలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంద్రవెల్లి నాగోబా జాతరకు రూ.22కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ప్రజల కోసం.. ప్రాంత అభివృద్ధి కోసం ఎవరినైనా కలవడానికి వెనకాడనని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, నిధుల కోసం ప్రధానిని ఎన్నిసార్లయినా కలుస్తానని తెలిపారు. ఇందుకు బీజేపీ ప్రజా ప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

### హైదరాబాద్ రెండో దశ పనుల పురోగతిపై లేఖ రాసిన కేంద్ర మంత్రి

### మెట్రో రెండో దశ గురించి కేంద్ర మంత్రితో చర్చించానన్న కిషన్ రెడ్డి

**జనవరి 16(జర్నలిస్ట్ వార్త);**



మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న కేంద్ర మంత్రి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై ఆయన ఈ లేఖ రాశారు. మెట్రోను ఎల్ అండ్ టీ నుండి స్వాధీనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని మీరే ప్రకటించారని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. మెట్రో రెండో దశ నిర్మాణం గురించి తాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించానని, అయితే ముందుగా మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారని అన్నారు. ఇందుకు సంబంధించి నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని, ఆ తర్వాత రెండో దశ మెట్రో నిర్మాణంపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం అంగీకరించిందని ఆ లేఖలో కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్రం, రాష్ట్రం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయించినట్లు కూడా ఖట్టర్ తనకు తెలిపారని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, కానీ ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను పంపించాలని కోరారు.

## స్టార్టప్ ఇండియాకు పదేళ్లు..
## దేశ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు

భారత యువత ఆవిష్కరణలు, నూతన ఆలోచనలతో నిజమైన సమస్యలను పరిష్కరించే మార్గంలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని ప్రారంభించిన ‘స్టార్టప్ ఇండియా’ మిషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాడు ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్ల ప్రయాణం కేవలం ప్రభుత్వ కార్యక్రమ విజయం మాత్రమే కాదని, లక్షలాది యువత కలలు సాకారమైన ప్రయాణమని ఆయన అభివర్ణించారు.

పదేళ్ల క్రితం దేశంలో 500 కంటే తక్కువ స్టార్టప్‌లు ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 2 లక్షలకు పైగా చేరిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పట్లో కేవలం నాలుగు యూనికార్న్‌లు (ఒక బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన స్టార్టప్) ఉంటే, ఇప్పుడు 125కు పైగా క్రియాశీల యూనికార్న్‌లు ఉన్నాయని, ఈ అద్భుతమైన వృద్ధి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని వివరించారు. ఈ ప్రగతితో భారత్, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. ఈ స్టార్టప్‌లు డీప్ టెక్, స్పేస్ టెక్, డ్రోన్ టెక్, క్వాంటం టెక్, అగ్రిటెక్, ఏఐ/ఎంఎల్ వంటి 50కి పైగా రంగాల్లో పనిచేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తున్నాయని ప్రధాని అన్నారు. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కథనం ప్రకారం, ఈ స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా 21 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలను సృష్టించాయి. స్టార్టప్ ఇండియా మిషన్‌లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని మోదీ అన్నారు. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు 45 శాతం వాటిలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ లేదా భాగస్వామి ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా, సుమారు సగం స్టార్టప్‌లు నాన్-మెట్రో నగరాల్లోనే ఉండటం, ఆవిష్కరణల కేంద్రాలుగా టైర్-2, 3 నగరాలు ఎదుగుతున్నాయనడానికి నిదర్శనమన్నారు.

# మీ పాలనలో ఇంకెంతమంది బలి కావాలి

(మొదటి పేజీ తరువాయి)

పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇన్ని అరాచకాలకు పాల్పడతారా? అని ప్రశ్నించారు. ఇక, మీ కక్షల పాలన ఫలితంగా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన మా పార్టీ కార్యకర్త, ఒక దళితుడైనా మందా సాల్మన్ హత్యకు గురైన ఘటనపై మీరు ఏం సమాధానం చెప్తారు? అని క్వశ్చన్ చేశాడు. అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూడ్డానికి సాల్మన్ సొంత గ్రామానికి వెళ్తే ఇనుప రాడ్లతో కొట్టి హత్యచేస్తారా? అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ముమ్మాటికీ తమ పార్టీని భయ పెట్టడానికి మీరు, మీ పార్టీ నేతలు కొంతమంది పోలీసులు ద్వారా చేస్తున్నారని మాజీ సీఎం జగన్ అన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా, మీరు అజమాయిషీ చెలాయిస్తూ, ఊళ్లో మీకు గిట్టని వారు ఉంటే చంపేస్తామని మీ ఎమ్మెల్యే, మీ పోలీసుల బెదిరింపులతో పిన్నెల్లి గ్రామం నుంచి వందల మంది వైయస్సార్ పార్టీ కార్యకర్తల కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని ఆరోపించారు. ఇదొక్కటే కాదు, అసెంబ్లీ ఎన్నికలు ముగిసింది మొదలు ఇలాంటి ఎన్నో ఘటనలు పల్నాడు సహా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అయితే, ఇంత జరుగుతున్నా సిగ్గు లేకుండా మారణకాండను ఈ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. పౌరులకు రక్షణ కల్పించడం, వారు స్వేచ్ఛగా తమ జీవితాలను గడిపేలా చూడ్డం మీ బాధ్యత కాదా?.. అలాంటి బాధ్యతలను నిర్వర్తించడంలో మీరు విఫలం చెందడం, పైగా మీరే మీ కక్షల కోసం శాంతి భద్రతలను దెబ్బ తీసి హత్యా రాజకీయాలకు వెన్నుదన్నుగా నిలవడం దుర్మార్గమైన విషయం కాదా? అని ప్రశ్నించారు. మీరు ముఖ్యమంత్రిగా ఉండి చేస్తున్న రాజ్యాంగ ఉల్లంఘన కాదా? చంద్రబాబు.. హింసా రాజకీయాలకు పాల్పడుతున్న మిమ్మల్ని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరు.. తప్పకుండా ఇలాంటి ఘటనలకు మీరు మూల్యం చెల్లించాల్సి వస్తుందని మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు.

# ఏఐతో జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

ఏఐ సంపన్నుల చేతుల్లో ఆయుధంగా మారుతుందనీ, తక్కువ పెట్టుబడితో ఇబ్బడి ముబ్బడిగా లాభాలు ఆర్జిస్తారనీ, అదే సమయంలో టెక్ నిపుణులను భారీగా తొలగిస్తారని స్పష్టం చేశారు. భవిష్యత్ టెక్ ప్రపంచ ఎలా ఉండబోతున్నదనేది హింటన్ వెల్లడించారు.

**ఇది పెట్టుబడిదారీ విధానం : హింటన్**

బ్రిటిష్-కెనడియన్ జాతీయుడైన జెఫ్రీ ఎవరెస్టు హింటన్ కంప్యూటర్ సైంటిస్టు, కాగ్నిటివ్ సైకాలజిస్టు, నోబెల్ బహుమతి గ్రహీత. ఏఐ న్యూరల్ నెట్‌వర్క్‌లపై చేసిన పరిశోధనలకు ఆయన ప్రసిద్ధి చెందారు. హింటన్ మాట్లాడుతూడ ఏఐ భవిష్యత్‌లో తీవ్ర ముప్పును కలిగించే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంపన్నులు, బడా పారిశ్రామికవేత్తలు ఏఐని ఉపయోగించి, ఉద్యోగుల సంఖ్యను అమాంతం తగ్గిస్తారనీ, కొత్త నియామకాలు నిలిపివేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో నిరుద్యోగం ఊహించని స్థాయికి చేరుకుంటుందనీ, అంచనాలకు అందని విధంగా కంపెనీల యజమానులు దండిగా లాభాలు సంపాదిస్తారన్నారు. ఫలితంగా కొద్ది మంది సంపన్నులుగా మారుతారనీ, 90 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగజారుతారని హెచ్చరించారు. ఇది ఏఐ తప్పిదం కాదనీ, పెట్టుబడిదారుల విధానం అని ఆయన వివరించారు.

**నిరుద్యోగం కంటే భారీ ముప్పు పొంచి ఉంది : హింటన్**

ఉదాహరణకు పదివేల మంది కష్టపడి ఒక అంశాన్ని నేర్చుకుంటే, దీనంతటినీ ఏఐ తక్షణమే నేర్చుకుంటుంది. ఏఐ తయారీ సంస్థలు తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించేలా సాంకేతికతకు ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి చేశాయని హింటన్ అన్నారు. ఏఐ రాకతో ప్రారంభ దశలో నియమించుకునే గ్రాడ్యుయేట్ల ఎంపికలు తగ్గాయనీ, ముమ్మందు పనిచేస్తున్న వారిని ఇంటికి పంపనున్నారని న్యూయార్క్‌కు చెందిన ఫెడరల్ రిజర్వ్ సర్వేలో వెల్లడయ్యిందని తెలిపారు. అయితే హెల్త్ కేర్ రంగంలో ఏఐ ప్రభావం అంతగా ఉండదన్నారు. ప్రస్తుతం ఏఐ వేగాన్ని గమనిస్తే 2026 తొలి నాళ్లలోనే నిరుద్యోగ సమస్య పెరుగుదలకు దారితీసే ప్రమాదముందని తెలిపారు. ఉద్యోగాల విషయాన్ని పక్కనపెడితే అంతకన్నా భారీ ముప్పు పొంచి ఉందని హింటన్ హెచ్చరించారు. లాభాల వేటలో పరుగెత్తే కంపెనీలు రక్షణ నిబంధనలను విస్మరించే అవకాశముందన్నారు. ఏఐతో ముమ్మందు ఇంకా ఎన్ని పరిణామాలు చోటు చేసుకుంటాయో చెప్పడం కష్టమని, మంచి, చెడులు ఉన్నాయని హింటన్ అభిప్రాయపడ్డారు.

# భారత్ కు మరిన్ని రఫేల్ యుద్ధ విమానాలు... డీపీబీ గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ కొనుగోలు మండలి (డీఏసీ) ముందుకు వెళ్లనుంది. అనంతరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ దీనికి తుది ఆమోదముద్ర వేయనుంది. అంతా సవ్యంగా జరిగితే వచ్చే నెలలోనే భారత్, ఫ్రాన్స్ మధ్య ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉంది. ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా ప్రభుత్వాల మధ్య ఈ కొనుగోలు ప్రక్రియ జరగనుంది. ఇదిలా ఉండగా, భారత నౌకాదళం కోసం రూ.63,000 కోట్ల విలువైన 26 రఫేల్-మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు గతేడాది ఏప్రిల్‌లో భారత్, ఫ్రాన్స్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా 22 సింగిల్-సీటర్ యుద్ధ విమానాలు, నాలుగు ట్విన్-సీటర్ శిక్షణ విమానాలు 2031 నాటికి అందనున్నాయి.

మరోవైపు, దేశీయంగా విమానయాన తయారీ రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో డసో ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ మధ్య ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం, హైదరాబాద్‌లోని టాటా ప్లాంట్‌లో రఫేల్ విమానాల ఫ్యూసిలేజ్‌లను తయారు చేయనున్నారు. 2028 ఆర్థిక సంవత్సరం నుంచి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభం కానుంది.

# మరో ఇద్దరికి స్పీకర్ క్లీన్‌చిట్

హైదరాబాద్**జనవరి 16(జర్నలిస్ట్ వార్త);**

తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో మరో ఇద్దరికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. సుప్రీంకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో ఒకరోజు ముందే తీర్పు ప్రకటించారు. ఇంకా ముగ్గురిపై విచారణ కొనసాగుతున్నది. మొత్తం పది మంది శాసన సభ్యులకుగాను స్పీకర్ ఇప్పటికే ఏడుగురికి అనర్హత విషయంలో క్లీన్‌చిట్ ఇచ్చినట్టయింది. పార్టీ మారినట్టు ఏలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. వారంతా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నట్టు తీర్పులో పేర్కొన్నారు. ఈ ఫిరాయింపుల వ్యవహారం తెలంగాణలో రాజకీయంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సంక్రాంతి పండుగ రోజైన గురువారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్యపై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్లను స్పీకర్ తిరస్కరించారు. పార్టీ మారినట్టు ఆధారాల్లేవనీ, వీరిద్దరిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్టు ఆయన తేల్చారు. అలాగే ఇంతకుముందు ఐదుగురిపై కూడా స్పీకర్ ఇలాంటి నిర్ణయమే తీసుకున్న విషయం తెలిసిందే. కాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య తదితరులు 2024 లో కాంగ్రెస్‌లో చేరినట్టు బీఆర్ఎస్ ఆరోపించిన విషయం విదితమే. అంతేగాక వీరిపై బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల పై అనర్హత వేటు వేయాలని కోరారు. అయితే స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది. తాజాగా శుక్రవారం మరో రెండు వారాల సమయం ఇస్తూ సుప్రీం ఆదేశాలిచ్చింది. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు తప్పకపోవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతున్నది. దానం పార్టీ మారడమేగాక సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున లోక్‌సభ బరిలో నిలిచి ఓడిపోయారని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. దీంతో ఆయన పరిస్థితి ప్రస్తుతం అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. గెలిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకున్న దానం నాగేందర్, ఇప్పుడు పదవీగండాన్ని ఎదుర్కొంటున్నారు. అలాగే కడియం శ్రీహరి సైతం తన కూతురు కడియం కావ్య వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేసిన సందర్భంగా ఆమె నామినేషన్ పత్రంలో సంతకం పెట్టారు. ఇది కూడా ఆయన పదవికి ముప్పుతెస్తుందనే ప్రచారం రాజకీయ విశ్లేషకుల్లో జోరుగా జరుగుతున్నది.

# మృతుడు కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం.



**బయ్యారం/జనవరి 16(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం కేంద్రంలో ఫిజికల్ డైరెక్టర్ ఇటీవల మరణించిన షేక్ బిక్కం(43) కుటుంబానికి బయ్యారం హైస్కూలులో బిక్కంతో పదవ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు వారి కుటుంబానికి పదివేలు ఆర్థిక సాయం చేశారు..ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మా చిన్న నాటి మిత్రుడి ఆకస్మిక మరణం, మా అందరికీ తీరని లోటు అని చింతించారు..తదానంతరం బిక్కం యొక్క కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# కాచనపల్లిలో వెల్లివిరిసిన సంక్రాంతి సంబరాలు.

## -మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణి.

### -యువతకు వాలీబాల్ పోటీల నిర్వహణ.



**బయ్యారం/జనవరి 16(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం కాచనపల్లి గ్రామపంచాయతీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా మహిళలకు ఇశీదిరమ్మ చీరల పంపిణి కార్యక్రమం, యువతకు వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కాచనపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ యాలం రేవతి,ఉప సర్పంచ్ ధారవాత్ శ్రీను హాజరై విజేతలకు బహుమతులు, ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు పస్తాం రవి,కొట్టెం వెంకటేశ్వర్లు,చాట్ల కుమారి,కొట్టెం సావిత్రి,గ్రామ పెద్దలు సోమ్లా,కొట్టెం నారాయణ,పాపారావు, వెంకటయ్య, దేవయ్య, ప్రమీల, సుభద్ర,పాయం రమేష్,కన్నయ్య,ముత్యాలు,అలెం ప్రమీల, చంద్రశేఖర్,అలెం హరీష్, వెల్లంకి భారతి,గ్రామ యువత, మహిళలు పాల్గొన్నారు.

# సిఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు.



**బయ్యారం/జనవరి 16(జర్నలిస్ట్ వార్త);** ఈ మధ్యకాలంలో గార్ల బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్గా బాధ్యతలు చేపట్టిన రవీందర్ ను స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు మాజీ మండల అధ్యక్షుడు రేలాగిరెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ , బయ్యారం పట్టణ అధ్యక్షులు, నాయిని శ్రీనివాస్ రెడ్డి,ఇతర నాయకులు పెద్దిన్ని వెంకటేశ్వరరావు, కొండ్రె డ్డి సోమిరెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల రాజకీయ పార్టీలు ఇతర విషయాలపై అడిగి తెలుసుకున్నారు.

# ఉపసర్పంచ్ ఎన్నిక చెల్లదంటూ...!

## ఎమ్మెల్యే కోరం కనకయ్య ను కలిసిన వార్డు సభ్యులు.



**బయ్యారం/జనవరి 16(జర్నలిస్ట్ వార్త);** మండలం కాచనపల్లి గ్రామపంచాయతికి చెందిన వార్డు సభ్యులు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఇల్లందు క్యాంపు కార్యాలయంలో కలిసినట్లు శు క్రవారం వారు తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు కోటెం సావిత్రమ్మ,చాట్ల కుమారి,అలెం కృష్ణవేణి,చింత శ్రీరామ్,బానోత్ సోమీ లను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కచనపల్లి వార్డు సభ్యులు ఎమ్మెల్యే కు శాలువాతో సన్మానించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కాచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గ్రామం కిష్టాపురం గ్రామంలో నుంచి మామిడి గుండాల వెళ్లే రహదారి లేక రైతులు ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు .కాచినపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. పాల్గొన్న తుడుం దెబ్బ మండల అధ్యక్షులు అల్లెం కృష్ణ ,బొల్లి మల్చూరు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్షిక రాజు, బొమ్మల పాండురాజు, బానోత్ రాంబాబు, అల్లెం సాంబశివరావు, వార్డు సభ్యులు కుమారి బానోతు సోని, చింత శ్రీరామ్ ,అల్లెం కృష్ణవేణి ,తదితరులు పాల్గొన్నారు.

# జగ్గుతండా గ్రామ పంచాయతీలో

## అంగ రంగ వైభవంగా ముగ్గుల పోటీలు.







### బహుమతుల దాతలు వీరస్వామి,శివ

**బయ్యారం/జనవరి16(జర్నలిస్ట్ వార్త);** మండలంలోని జగ్గు తండ పంచాయతీ పరిధిలో సంక్రాంతి కనుమ పండుగ పురస్కరించుకొని శు క్రవారం సంత రోడ్డు సమీపంలో మహిళలకు ముగ్గుల రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గు తండా సర్పంచి బొల్లి జయంతి వెంకటకృష్ణ ,ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి నాయకులు గుంజ శివ వారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి సిహెచ్ గీతాంజలి,ద్వితీయ మారం ప్రవళిక, తృతీయ బి శరణ్య, నాలుగో బహుమతి బి. శోభా బహుమతులను గుంజ వీరస్వామి కుమారుడు శివ వారి స్వంత ఖర్చులతో బహుమతులు ప్రధానం చేసినట్లు,తెలిపారు. అదేవిధంగా పోటీలలో పాల్గొన్న అందరి మహిళలకు కన్సలేషన్ బహుమతులను అందించారు . ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మక్కల దుర్గారావు , తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాధ్వీ మేడం,ఇతర నాయకులు సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా అవగాహన

## సిఐ రవీందర్




**బయ్యారం/జనవరి 16(జర్నలిస్ట్ వార్త);** మహబూబాబాద్ జిల్లా ఎస్పి డా.శబరిష్ ఆదేశానుసారంగా శు క్రవారం బయ్యారం ఎంపీడీఓ కార్యాలయంలో అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ లో భాగంగా గార్ల బయ్యారం సీఐ ఎల్.రవీందర్ పాల్గొని తహసీల్దార్ ఆఫీస్ ఎంప్లాయిస్,ఎంపీడీఓ ఆఫీస్ ఎంప్లాయిస్,హెల్త్ డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్ కి రోడ్డు భద్రత నియమాలను వివరించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాలు గురించి వివరిస్తూ దానికి గల కారణాలను తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని సీట్ బెల్ట్ ధరించాలని మద్యం సేవించి, వాహనాలు నడపరాదని నిర్లక్ష్యంగా అతివేగంగా వాహనాల నడపరాదని మైనర్లకు డ్రైవింగ్ ఇవ్వకూడదని సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని ,ఓవర్ లోడ్ వాహనాలను నడపారాదని వివరించారు. ఈ కార్యక్రమంలోమండల తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ కుమారి దీపిక, ఎంపీవో చంద్రమోహన్, ఎస్సై కే .తిరుపతి ,మండల పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్న వయసు లోనే 'ఎయిర్ ఫోర్స్ ' లో ఉద్యోగం సాధించిన సరిత..



**కల్లూరు/జనవరి 16(జర్నలిస్ట్ వార్త);** కల్లూరు మండలం రావికంపాడు గ్రామానికి చెందిన సరిత అరుదైన ఘనత సాధించింది. ఇమ్మడి లక్ష్మి నారాయణ, కుమార్తె అయిన సరిత 20 సంవత్సరాల వయసు లోనే వైమానిక దళం లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక అయింది. అతి చిన్న వయసులోనే దేశ సేవ చేసే అవకాశం దక్కించుకున్న సరిత ను ఆ ఊరి గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. సరిత చిన్న వయసులోనే విజయం గ్రామం లోని ఇతర యువతి యువకులకి స్ఫూర్తిదాయకం అని పలువురు కొనియాడారు.

# ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి సరిత



**బయ్యారం/జనవరి16(జర్నలిస్ట్ వార్త);** మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో ఎరువుల విక్రయ కేంద్రాలు సాయిబాబా ట్రేడర్స్,బిస్మిల్లా ఎంటర్ప్రైజెస్,మదీనా ట్రేడర్స్ లను జిల్లా వ్యవసాయ అధికారి బి.సరితా తనిఖీ చేసి, సంబంధిత డీలర్లు అన్ని రికార్డులను కచ్చితంగా, సక్రమంగా నిర్వహించాలని,రైతులకు యూరియా సక్రమంగా అందించాలని సూచించారు. నఖిలి ఎరువులు,పురుగు మందులు,నాణ్యత లేని విత్తనాలు, ఎక్స్ ఫైర్ అయిన పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే. రాజు తదితరులు పాల్గొన్నారు.

# కుర్నవల్లి సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ, ఆశీర్వాధించిన పొంగులేటి శ్రీనన్న



**తల్లాడ/జనవరి16(జర్నలిస్ట్ వార్త);** మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామ పర్యటించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డికాంగ్రెస్ పార్టీ నాయకులు, బాపిరెడ్డి,గంటల వెంకటాచారి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, అభినందన సభ ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా, శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐలూరి వెంకట కోటారెడ్డి, శివారెడ్డి, ఎక్కిరాల పాపులు, ఇనుపనూరి వీరస్వామి, యూత్ నాయకులు,గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# బిల్లుపాడు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాట్లు

**తల్లాడ/జనవరి16(జర్నలిస్ట్ వార్త):** తెలుగుదేశం పార్టీ స్థాపించిన దగ్గర నుంచి నందమూరి తారకరామారావు ఆశీస్సులతో ఖమ్మం జిల్లా, తల్లాడ మండలం లోని బిల్లుపాడు గ్రామానికి చెందిన నారపోగు. ప్రసాద్ బాబు టిడిపిపార్టీ కు విధేయుడుగా ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో రాష్ట్రంలో ఎక్కడైనా జరిగిన పార్టీ కార్యక్రమాలకు హాజరవుతూ తన వంతు పాత్రగా పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాన భూమిక పోషించిన వారుగా ఉన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ కార్యకర్తలను మతాలకు, పార్టీలకు అతీతంగా తెలుగుదేశం పార్టీ వైపు నడిపించడంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా నియోజకవర్గంలో చెప్పుకుంటారు. తన స్వగ్రామమైన బిల్లుపాడు గ్రామంలో అతి త్వరలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి. తారక రామారావు విగ్రహావిష్కరణ ఏర్పాట్లు చేయబోతున్నారని పార్టీ పెద్దలు తెలియజేశారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ దిమ్మలు గ్రామ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని గ్రామ తెలుగుదేశం పార్టీ పిలుపునివ్వడం జరుగుతుంది. బౌత్కర



కార్యక్రమంలో బిల్లుపాడు గ్రామ శాఖ అధ్యక్షుడునారపోగు ప్రసాద్ బాబుకు రాష్ట్ర నలుమూలల నుంచి అతిరథ మహారథులు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని టిడిపి పార్టీ మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరావుతెలియజేశారు. కావున తెలుగుదేశం పార్టీ అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా నారపోగు ప్రసాద్ బాబు, ఎన్టీఆర్ యూత్ నారపోగు విజయ్, గరిడేపల్లి హరీష్. ఎనిక వీరభద్రరావు, విగ్రహం ఏర్పాట్లకు తల్లాడ తెలుగుదేశం పార్టీ మండల శాఖ ఆదేశాల మేరకు,యువతకృషి చేస్తున్నారు.



# ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేత



**తల్లాడ/జనవరి16(జర్నలిస్ట్ వార్త);**మండల పరిధిలో గంగదేవి పాడుగ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీ పాల్గొన్న ముఖ్యఅతిథిగా అడపా అనిల్ బాబు,ఎస్సీ కాలనీ నందు ప్రెసిడెంట్ తేలపుట శ్రీదేవి వైస్ ప్రెసిడెంట్ తెనాలి సత్యం కమిటీ ఆధ్వర్యంలో అందరూ ముగ్గుల పోటీలో పాల్గొన్నారు 5 ప్రైజ్ లు అడపా అనిల్ చౌదరి స్పాన్సర్ చేశారు అందరికీ ఇవ్వడం జరిగింది బహుమతులు ఈ కార్యక్రమంలో చాలామంది పాల్గొన్నారు అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు .

# వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ ను కలిసిన తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు



**తల్లాడ/జనవరి16(జర్నలిస్ట్ వార్త);**



తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని శుక్రవారం తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు ఈ సందర్భంగా మంత్రి కి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే ఎంపీటీసీ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు. నా సహాయ సహకారాలు తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎప్పుడు ఉంటాయని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాదేవి పాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుండేటి వీరారెడ్డి పగడాల లచ్చిరెడ్డి, రెడ్డిగూడెం సర్పంచ్, అంబేద్కర్ నగర్ సర్పంచ్, అన్నారుగూడెం మాజీ వీడిసి చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ , కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండలం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కుర్నవల్లిలో అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబరాలు

## భోగిళ్లలో వెలిసిన రంగుల హరివిల్లు
## భోగభాగ్యాల భోగిమంటలు
## డూడు బసవన్నల దీవెనలు
## భారీ స్థాయిలో ముగ్గుల పోటీలు

**తల్లాడ/జనవరి16(జర్నలిస్ట్ వార్త);**
జనసంద్రంగా మారిన బొడ్రాయి సెంటర్ చలిని తరిమికొట్టే బోగి మంటలు,ఆ మంటల్లో చిన్నారులు ఆవు పేడతో చేసిన బోగి పిడతలను వేయడం,హరిదాసుల కీర్తనలు,డూడూ బసవన్నల దీవెనలు..!ఇంటి ముందు అందమైన రంగవల్లులు,గొబ్బెమ్మలు..! వేకువజామునే జంగమదేవరల జేగంటలు,ఢమరుక నాదాలు..! అక్కడక్కడా పిట్టలదొరల బడాయి మాటలతో.. కుర్నవల్లి గ్రామం సంక్రాంతి పండుగకు సరికొత్త శోభతో విరాజిల్లింది. ముఖ్యంగా ప్రవాస భారతీయుడు సహకారంతో గ్రామంలోని యువత ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిర్వహించిన రంగుల హరివిల్లు కుర్నవల్లి వాకిళ్లను ఆవహించినట్టు...ఆ ఇంద్రధనస్సు నింగి నుంచి నేలకు దిగి ముంగిలి లో ముగ్గేనట్టు.. కుర్నవల్లి సంక్రాంతి వేడుకలతో సంబరం చేసుకుంది.ప్రవాస భారతీయుడు



శీలం నరేందర్ రెడ్డి, స్వప్న దంపతుల సహకారంతో గ్రామంలోని బొడ్రాయి సెంటర్,వేంకటాచలపతి దేవస్థాన యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీకి విశేష స్పందన లభించింది. చిన్న పెద్ద,ఆడబిడ్డలు,కొత్త కోడళ్ళు అనే తేడా లేకుండా ఊరుమ్మడి ఆడపడుచులు తమ సృజనాత్మకతకు పదును పెట్టి నింగిలో చుక్కలు నేలను తాకి,మెరుపు తీగలను మలుచుకొని ముగ్గెనట్టు,ఆడపడుచుల చేతులలో ముగ్గులు ముద్దబంతి పువ్వులా మెరిసినాయి.సుమారు 120 పైగా అద్దుకున్న అందాలు సంప్రదాయానికి ప్రతీకలుగా నిలిచి,సమైక్యతా



రాగాన్ని వినిపించాయి.నిస్వార్థ భావాన్ని తడిమి లేపాయి.గ్రామీణ వాతావరణాన్ని,శ్రామిక సౌందర్య వాతావరణాన్ని పులుముకొని,పులకరించాయినింగిన తారజువ్వలై,నేలన తారలై అందాల హరివిల్లులై ముంగిలి ముద్దాడినవి.సంధ్య వేళలో జరిగిన ఈ వర్ణ వాదనలకు సరిజోడు తేల్చడానికి సాధ్యం కాని పోటీ పడింది.ఈ ముగ్గులపోటీని యావన్మంది తిలకించి ముగ్ధులయ్యారు.కాగా ఈ పోటీలో విజేతలను ఎంపిక చేసేందుకు ముగ్గురు న్యాయవాదులు,ఇద్దరు ఉపాధ్యాయులు తన కౌశలాన్ని ప్రదర్శించాల్సి వచ్చింది.ప్రతి ముగ్గుని విశ్లేషించి,ఆఖరుకు పది ముగ్గులను ఎంపిక చేసి,వాటిలో ప్రథమ స్థానంలో ఉన్న ఐదు ముగ్గులను ప్రకటించారు.విజేతలకు న్యాయనిర్ణేతల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన వాటిలో హై కోర్టు న్యాయవాది అయితగాని జనార్దన్,జిల్లా కోర్టు న్యాయవాదులు కోటేరు స్పందన రెడ్డి,మౌనిక ప్రభుత్వ కళాశాల ఉపన్యాసకురాళ్ళు కాటినేని దుర్గ,ధారా ప్రమీల ఉన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

# బాధిత కుటుంబానికి యూకే ఫౌండేషన్ చైర్మెన్ ఆర్థిక సహాయం



**రాయపర్తి/జనవరి 16(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనికి చెందిన ఐత దాసుబాబు కుమారుడు ఐత భగవాన్ ఇటివల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం ఆయన చిత్రపటానికి యూకే ఫౌండేషన్ చైర్మెన్, తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గారే వెంకటేష్ మాదిగ పూల మాల వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూకే ఫౌండేషన్ సభ్యులు గారే సందీప్,ఐత సాయిలు,ఐత యాకయ్య,ఐత కుమార్,ఐత సంపత్,తదితరులు పాల్గొన్నారు.

# మందు, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## -- ఎమ్మెల్యే జారె -జగ్గారంలో గ్రామపంచాయతీల స్థాయి వాలీబాల్ టోర్నీ ఘనంగా ప్రారంభం..





**దమ్మపేట/జనవరి16(జర్నలిస్ట్ వార్త):**
దమ్మపేట మండలం జగ్గారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్గారం, బాలరాజుగూడెం రెండు గ్రామపంచాయతీల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా తాను స్వతహాగా వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేసిన అనుభవంతో క్రీడలపై ప్రత్యేక మక్కువ కలిగి ఉన్నానని తెలిపారు క్రీడలు యువతకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు.
రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు విశేష ప్రాధాన్యత ఇస్తోందని గ్రామీణ స్థాయిలో యువత చెడు వ్యసనాలు అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకుండా ఉండాలంటే క్రీడలే ఉత్తమ మార్గమని అన్నారు క్రీడల ద్వారా ప్రతిభ కనబరిస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశాలు ప్రభుత్వాల ద్వారా కల్పించబడుతున్నాయని స్పష్టం చేశారు మద్యం, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వాటివల్ల సామాన్య కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు యువత క్రీడలపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సర్పంచులు వంకా జానకిరాముడు, కీసరి లక్ష్మీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ యాకన్న ను సన్మానించిన శాలివాహన సంఘం సభ్యులు

**రాయపర్తి/జనవరి 16(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని కొండూరు గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన రాయిని యాకన్న ను శుక్రవారం శాలివాహన సంఘం అద్యక్షుడు కల్పగిరి జనార్ధన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శాలివాహన కులస్తులకు ఇందిరమ్మ ఇండ్లు, శాలివాహనులకు కుండలకు అవసరమయినా మట్టి కోసం దేవుని కుంట,చిన్న ఫంక్షన్ హాల్ కావాలని కోరారగా సర్పంచ్ యాకన్న సానుకూలంగా స్పందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం నాయకులు కల్పగిరి చిన్న ఎల్లయ్య, జనరల్ సెక్రటరీ ఆకారపు సుధాకర్, ఏనుగుతల రాము,కోశాధికారి కల్పగిరి శ్రీను , సభ్యులు ఎల్లయ్య,సోమయ్య, ఉప్పలయ్య,వెంకటయ్య, సోమయ్య, సాంబయ్య, శోభ, అరుణ లు తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బండి సుధాకర్ గౌడ్

**ఐనవోలు/జనవరి 16(జర్నలిస్ట్ వార్త):**మృతుని కుటుంబాన్ని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ పరామర్శించి,ఆర్థిక సహాయం అందజేశారు. ఐనవోలు మండలం పంతిని గ్రామానికి చెందిన మేకల గట్టయ్య ఇటీవల మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న టీపీసీసీ అధికార ప్రతినిధి మరియు స్పోక్ పర్సన్ బండి సుధాకర్ గౌడ్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. కష్ట కాలంలో ఆర్థిక సహాయం అందజేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ కు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పంతిని మాజీ ఉపసర్పంచ్ బండి మహేందర్ గౌడ్, మండల నాయకులు చిర్ర శ్రీనివాస్, బండి రమేష్, కంకర శ్రీనివాస్, దంసాని ఎల్ల కుమారి, బరిగల స్వామి, 11వ వార్డు నెంబరు చిర్ర శ్రీధర్, మేకల సుధాకర్,మేకల రాకేష్, జన్ను అఖిల్, ఇజ్జగిరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# మహిళా చైతన్యమే సమాజాభివృద్ధి

## చంద్రుగొండ గ్రామ సర్పంచ్ బక్కి కవిత -అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి








**నెక్కొండ/జనవరి 16(జర్నలిస్ట్ వార్త);**
మండలం చంద్రుగొండ గ్రామం లో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం చంద్రుగొండ గ్రామ శాఖ ఆధ్వర్యంలో 25 వ రంగవల్లిక ముగ్గుల పోటీలు కార్యక్రమం చంద్రుగొండ, గొల్లపల్లి పరిధిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో గ్రామ శాఖ అధ్యక్షులు మాంకాల మధుకర్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల ప్రవర్తి వెలిగించదం జరిగింది, ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ బక్కి కవిత హాజరై మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న కళలను, నైపుణ్యాలను వెలికితీస్తూ 25 సంవత్సరాల నుండి చైతన్య పరుస్తూ నిర్వహిస్తున్న రంగవల్లిక ముగ్గుల పోటీల కార్యక్రమం ఎంతో హర్షించదగినదని, అభినందనీయమని, యువజన సంఘ సభ్యుల ఐక్యత, కృషి ఆదర్శనీయమని, ఇలాంటి పోటీ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగ పరుచుకుని తమ కలలను, కళాత్మక నైపుణ్యాలను ప్రదర్శించి చైతన్య మవ్వాలని, అన్ని రంగాల్లో ముందుండాలని, అంబేద్కర్ కళలుగన్న మహిళా సాధికారిక సమాజాన్ని నిర్మించాలని, సమాజానికి ఆదర్శంగా నిలిచి సమాజాన్ని చైతన్య పరచాలని, యువజన సంఘానికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తారని, గ్రామ అభివృద్ధిలో యువకుల సహకారం, సేవలు అవసరమని, ఇలాంటి అనేక కార్యక్రమాలు నిర్వహించి మన గ్రామాన్ని ప్రత్యేక గుర్తింపుగా నిలపాలని,యువజన సంఘా సభ్యుల ఐక్యతను అభినందిస్తున్నారని, చంద్రుగొండ,గొల్లపల్లి పరిధిలో రంగవల్లిక ముగ్గుల పోటీలో పాల్గొన్న 120 మంది మహిళలను అభినందిస్తున్నానని, బహుమతి రానివారు నిరుత్సాహ పడకుండా మరోసారి మీ యొక్క పట్టుదల, ప్రయత్నాన్ని కొనసాగించాలని, హాజరైన గ్రామాల ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు, ఇట్టి కార్యక్రమంలో గౌరవ అతిథులుగా మాంకాల యాదగిరి, ప్రోగ్రాం బహుమతుల కార్యక్రమ దాతలు దొమ్మాటి సుధాకర్, కీర్తి మాలతి, న్యాయనిర్ణేతలు మాశీకాల యాకాశీబ్రం, మునిగే ప్రభాకర్, అడ్వకేట్ ప్రభాకర్, పాలిటెక్నిక్ లెక్చరర్ మాంకాల నరేందర్, ఉపాధ్యక్షులు బాకీ సునీల్, కోశాధికారి మంకాల చాంటిబాబు, సలహాదారులు గణేష్,మాజీ ప్రధానకార్యదర్శి బాకీ కరుణాకర్, శ్రీకాంత్,ప్రకాష్, ముఖేష్,చేరాలు, బాబు మరియు సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు, అనంతరం రంగవల్లిక ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు నగదు పురస్కారంతోపాటు షీల్డ్ మేమంటోస్ బహుకరించడం జరిగింది, ప్రథమ బహుమతి ఉసిల్ల శ్రీహర్ష, ద్వితీయ బహుమతి బోనగిరి స్రవంతి, ప్రతి బహుమతి మామిండ్ల లలిత, కాన్సిలేషన్ తంశెట్టి కళ్యాణి లతో పాటు సాంస్కృతిక డాన్స్ పోటీల్లో ప్రథమ బహుమతి మాశీకాల ఐక్య, ద్వితీయ బహుమతి మాశీకాల జెస్సికా, తృతీయ బహుమతి అయిత తేజశ్రీ, కాన్సోలేషన్ బియ్యపు తేజస్వి, సాంగ్స్ కాంపిటేషన్ చందర్ లు గెలుపొందారు, ప్రత్యేక ఆకర్షణగా ఏ జే యూట్యూబ్ ఛానల్ ప్రత్యక్ష ప్రసారాలు నిలిచాయి

# రాజకీయాల్లో నిజాయితీ ఓడితే నష్టపోయేది వ్యక్తి కాదు సమాజమే!



ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాల ప్రధాన లక్ష్యం ప్రజల సంక్షేమం, సమాజ అభివృద్ధి కావాలి. కానీ కాలక్రమేణా ఈ లక్ష్యం మసకబారుతూ, అధికారానికి చేరుకోవడమే పరమావధిగా మారింది. ఈ మార్పు వల్ల రాజకీయాల్లో నిజాయితీ, విలువలు, నిబద్ధత వంటి అంశాలు పక్కకు నెట్టబడ్డాయి. ఈ పరిస్థితుల్లో నిజాయితీ పరులు రాజకీయాల్లో విఫలమవడం ఒక వ్యక్తిగత పరాజయంగా కాకుండా, సమాజానికి జరిగిన నష్టంగా భావించాల్సిన అవసరం ఉంది.

ఎన్నికల రాజకీయాల్లో డబ్బు, కులం, మతం, ప్రలోభాలు కీలకంగా మారిన వేళ నిజాయితీకి స్థానం క్రమంగా తగ్గిపోతోంది. ప్రజల సమస్యలను గుండెతో అనుభవించి, పరిష్కారాల కోసం పోరాడే వ్యక్తులు కాకుండా, మాటలతో మాయ చేసి ఓట్లు కొల్లగొట్టే నాయకులు పైచేయి సాధిస్తున్నారు. ఈ పరిణామం ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైనది. ఎందుకంటే ఇక్కడ ఓడిపోతున్నది ఒక అభ్యర్థి కాదు; ప్రజల విశ్వాసం, సమాజ భవితవ్యం.

నిజాయితీ పరులు ఓడినప్పుడు గెలిచేది ఎవరు అనే ప్రశ్నను ప్రతి పౌరుడు తన మనసులో వేసుకోవాలి. ఆ గెలుపు ప్రజలకా? లేక స్వార్థ రాజకీయాలకు, అవకాశవాద శక్తులకా? ప్రజాసేవను వృత్తిగా భావించినవారు పక్కన పడిపోతే, రాజకీయాలను వ్యాపారంగా మార్చుకున్నవారికి అధికారం దక్కుతుంది. ఇది సమాజంలో అసమానతలను పెంచుతుంది, పాలనపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. కానీ ఆ బాధ్యతను మనం ఎంతవరకు నిర్వర్తిస్తున్నాం అనే ప్రశ్న కూడా ఈ సందర్భంలో ఎదురవుతుంది. తక్షణ లాభాల కోసం, తాత్కాలిక హామీల కోసం, లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిజాయితీని పక్కన పెట్టడం సమాజానికి తిరిగిరాని నష్టాన్ని మిగులుస్తుంది. ఒకసారి విలువలకు పరాజయం జరిగితే, ఆ ఖాళీని పూరించేందుకు సంవత్సరాలు పడతాయి.రాజకీయాల్లో నిజాయితీ ఓడిపోతే దాని ప్రభావం ఒక్క పాలనపైనే కాదు, సమాజంలోని ప్రతి రంగంపై పడుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి వంటి కీలక రంగాల్లో నిర్ణయాలు ప్రజాహితం కాకుండా, వ్యక్తిగత లాభాలకే పరిమితమవుతాయి. ఫలితంగా సామాన్యుడి జీవితం మరింత కఠినమవుతుంది. ఈ పరిణామాలకు మూలం రాజకీయాల్లో విలువల పతనం అనే వాస్తవాన్ని విస్మరించలేం.నిజాయితీకి పరాజయం అనేది ఒక ఎన్నికతో ముగిసే విషయం కాదు; అది భవిష్యత్ తరాలపై పడే నీడ. పిల్లలకు మనం ఇచ్చే సందేశం ఏమిటి? నిజాయితీతో ఉండటం ఓటమికి దారి తీస్తుందన్న భావనా? లేక విలువలతో కూడిన జీవితం సమాజాన్ని మార్చగలదన్న విశ్వాసమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు మన ఎన్నికల ప్రవర్తనలోనే దాగి ఉన్నాయి.అందుకే రాజకీయాల్లో నిజాయితీ పరుల ఓటమిని తేలికగా తీసుకోవడం ప్రమాదకరం. అది వ్యక్తి పరాజయం కాదు; సమాజం చేసిన తప్పు నిర్ణయం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే, విలువలకు సమాజ భవితవ్యం సురక్షితంగా ఉండే మార్గం. ప్రజలు ఈ నిజాన్ని ఎంత త్వరగా గ్రహిస్తారో, అంత త్వరగా ప్రజాస్వామ్యం తన అసలైన అర్థాన్ని తిరిగి పొందుతుంది.



సీనియర్ జర్నలిస్ట్
కొట్టే లెనిన్ సుధాకర్
990840158

# మండలంలో కేంద్ర బృందం పర్యటన..

## మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలన





**భీమదేవరపల్లి/జనవరి 16 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త డైరెక్టర్ గయా ప్రసాద్ నేతృత్వంలోని కేంద్ర బృందం పర్యటించింది. శుక్రవారం మండలంలోని కొప్పూరు, విశ్వనాథ కాలనీ గ్రామాల్లో తుఫాను దాటికి నష్టపోయిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న కాలువలు, నీట మునిగిన వరిపంట వివరాలు, దెబ్బ తిన్న రోడ్ల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు . చేతికి వచ్చిన పంటలు నీటిపాలవ్వడంపై రైతులు తమ ఆవేదనను బృందానికి వివరించారు. అనంతరం కొప్పూర్ గ్రామాన్ని సందర్శించిన బృందం, తుఫాను కారణంగా పాక్షికంగా, పూర్తిగా ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. అదేవిధంగా గాలివాన ధాటికి మృతి చెందిన పశువుల వివరాలను బాధితుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో మండలంలో మొంథా తుఫాను వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసి నమోదు చేసుకున్నారు. ఈ పర్యటనలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు జిల్లా కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారి, తహసిల్దార్, ఇతర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్రస్వామి ఆలయంలో కనుమ ఉత్సవం

## కనుమ వేడుకల్లో నందీశ్వరపూజ






**భీమదేవరపల్లి/జనవరి16 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం కనుమ ఉత్సవం, పుష్పయాగం నిర్వహించారు కనుమ పండుగ సందర్భంగా నందీశ్వరునికి అభిషేకం చేసారు. కనుమ, పశువుల పండుగగా, పంటలు చేతికి అందడంలో తమకు సహాయపడిన పశు పక్షాదులను పూజిస్తారని ప్రసిద్ధి. సంవత్సరంలో మిగిలిన రోజులన్నీ తమతో పాటు కష్టపడి పనిచేసిన ఆవులను, ఎద్దులను, పూజించి ప్రేమగా చూసుకునే రోజు, పక్షులు కూడా రైతన్ననేస్తాలే. అందుకే వాటి కోసమే అన్నట్టు ఇంటి గుమ్మానికి ధాన్యపు కంకులు వ్రేలాడ దీస్తారని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ బొజ్జపురి అశోక్ ముఖర్జీ, ఇవో కిషన్ రావు, అర్చకులు రాంబాబు, వినయ్ శర్మ, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వీరభద్రస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రులు

**ప్రత్యేక పూజలు చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ -ఈ ప్రాంతం, ఆలయ అభివృద్ధి పనులకు రూ.70కోట్లు**








**భీమదేవరపల్లి/జనవరి16 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారిని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ కొండా సురేఖ దర్శించుకున్నారు. గురువారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ ద్వారం వద్ద నూతనంగా నిర్మించిన త్రిశూల చౌరస్తాను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి సందర్భంగా భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. సంక్రాంతి సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కాకతీయుల కాలం నాటి వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు రావడం జరిగిందన్నారు. ఈ ప్రాంతానికి, దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి మాడ వీధులు అభివృద్ధి చేసుకోవడానికి ఇతర పనుల కోసం రూ.70కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిన మంత్రి కొండ సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. గుమ్మడి కాయల దేవుడుగా, కోర మీసాల దేవుడు కోరిన కోరికలు తీర్చే దేవుడి అనేక మంది ప్రజలు స్వామివారి దర్శనానికి వస్తారన్నారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయం మరింత అభివృధి జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పీసీసీ అధ్యక్షుడిగా ఇక్కడికి రావడం జరిగిందని, ఆలయ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు దేవాదాయ శాఖ మంత్రికి పంపించినట్లు వెల్లడించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. స్వయంభూగా వెలిసిన కోర మీసాల వీరభద్ర స్వామి పురాతన చరిత్ర ఉందన్నారు. కాకతీయుల కాలం నుంచి ఇక్కడ వైభవంగా బ్రహ్మోత్సవాలు, మకర సంక్రాంతి పండుగ సందర్భంగా జాతర ఉత్సవాలు జరగడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇక్కడ భక్తులు కోరికలు తీర్చుకోవడం కోసం స్వామివారికి కోర మీసాలు సమర్పిస్తారని తెలిపారు. అదేవిధంగా కోడె కట్టి, గుమ్మడి కాయలుతో మొక్కలు చెల్లించుకునే ఆచారం కొనసాగుతుందని అన్నారు. భక్తులు క్షేమంగా వచ్చి దర్శనం చేసుకొని తిరిగి క్షేమంగా వెళ్ళేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేసి జాతర బ్రహ్మోత్సవాలు విజయంతం చేయాలన్నారు. ఇక్కడకు భద్రకాళి అమ్మ వారు ఎందుకు వచ్చారంటే ఉగ్ర వీరభద్రుడి కోసం అమ్మవారు వచ్చారని ఆలయ అర్చకులు వివరించారు. పొన్నం అన్నతో ఇక్కడ అనేక అభివృద్ధి పనులు చేసుకుంటున్నారని, ఇక్కడి ప్రజలు అదృష్టవంతులు ఎందుకంటే పని చేసే పొన్నం ప్రభాకర్ అన్నని గెలిపించుకున్నారని మంత్రి కొండా సురేఖ చెప్పారు. భద్రకాళి నుంచి బాసర అనే ఒక ఆలోచన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని అన్నారు. అందుకు మంత్రి శ్రీధర్ బాబు సారధ్యంలో సబ్ కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ జాతర ఉత్సవ కమిటీ ఛైర్మన్ బొజ్జపురి అశోక్ ముఖర్జీ, ఇవో కిషన్ రావు, అర్చకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు



**రాయపర్తి/జనవరి 16(జర్నలిస్ట్ వార్త):** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కనుమ పండుగ రోజు మండలంలోని పేరికేడు గ్రామంలో నిర్వహించుకునే శ్రీ అమృత లింగేశ్వర మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, వర్ధన్నపేట ఐఏఎంసి మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి పాల్గొని స్వామివారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ తీగల సాయిలు,వివిధ గ్రామాల సర్పంచులు పెండ్లి మహేందర్ రెడ్డి, బాలునాయక్ తండా సర్పంచ్ భూక్య శ్రీదేవిసమ్మయ్య,కాంగ్రెస్ నాయకులు రెంటాల గోవర్ధన్ రెడ్డి,మాందాటి సుదర్శన్ రేడ్డి,వర్ధనపేట ఏఎంసీ డైరెక్టర్ పుల్లూరి దామోదర్,మండల మహిళా అధ్యక్షురాలు ఊగా మునిత,ఉప సర్పంచ్ దూరిశెట్టి రమేష్,సుతారి యాదగిరి,తీగల సాయిలు,ఇల్లందుల భగవాన్,ఐరెడ్డి ఎల్లారెడ్డి,కిషన్ నాయక్,గోపాల్ నాయక్, డీజే శ్రీను,సేనాధిపతి,రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా బాట తోనే విద్యుత్ సమస్యలు పరిష్కారం

**- డిఈ దానయ్య.**




**రాయపర్తి/జనవరి 16(జర్నలిస్ట్ వార్త):** ప్రజా బాట కార్యక్రమం తోనే విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని డి దానయ్య అన్నారు శుక్రవారం మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందించడమే తమ లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో ఏడిఈ నటరాజ్,ఏఈ తరుణ్, సబ్ ఇంజనీర్ విక్రమ్, అన్వర్, రాజు,వెంకన్న,ఉప సర్పంచ్ తోట సోమా నరసయ్య,నర్సింహచార్యులు,నవీన్,యాదయ్య, మల్లేష్ మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**భీమదేవరపల్లి/జనవరి16 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావేరి సీడ్స్ ఎండీ భాస్కర్ రావు హాజరయ్యారు. పాఠశాలలో 1992 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వేదిక ఏర్పాటు చేసుకుని కలిసారు. గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ స్కూల్ లో చదువుకున్నప్పటి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కావేరి సీడ్స్ ఎండీ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందాలని, తెలివి, కష్టాన్ని నమ్ముకుంటే అభివృద్ధి చెందుతారని అన్నారు. బానోత్ సురేష్ నాయక్ ముందుండి పూర్వ విద్యార్థులను ఒకచోటికి చేర్చి పండుగ వాతావరణం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంపత్, రవీంద్ర చారీ, మద్దెల ఐలయ్య. అశోక్, రామారావు, శ్రీనివాస్, రవి, రాజేశ్వర్ రావు, మంగ, ప్రేమలత, స్వర్ణలత, కోమలత, ధనలక్ష్మి, మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటపాటలతో సంబురాలు చేసారు.

# గృహజ్యోతి లబ్ధిదారులకు ప్రశంసా పత్రాలు అందజేసిన విద్యుత్ అధికారులు




**స్టేషన్ ఘన్ పూర్/జనవరి16 (జర్నలిస్ట్ వార్త) :** చిల్పూర్ మండలంలోని కృష్ణాజిగూడెం గ్రామం లో విద్యుత్ అధికారులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ మల్లం రవీందర్ చేతుల మీదుగా గృహజ్యోతి లబ్ధిదారులకు ప్రశంసాపత్రాలు అంద జేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ డివిజన్ పరిధిలోని గృహజ్యో తి, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాచేపట్టిన ఆరు గ్యారెంటీ లలో భాగంగా గృహజ్యోతి పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు200 యూని ట్ల ఉచిత కరెంటును అందించడం జరుగుతుందని, గృహజ్యోతి, వ్యవ సాయ విద్యుత్ వినియోగ దారులకు నూతనసం వత్సర,సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదే శానుసారం కృష్ణాజిగూడెం లో ప్రశంసా పత్రాలు అందించడం జరిగిందిని విద్యుత్ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మల్లం రవీందర్, ఉపసర్పంచ్ గద్ద కోమల కుమార్, ఎన్పి డిసిఎల్ ఆపరేషన్ ఏఈ సురేష్, లైన్ ఇన్స్పెక్టర్ రామ్మూర్తి,అసిస్టెంట్ లైన్మెన్ డ్యాగల సాంబరాజు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ,మండల శాఖ నాయ కులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.